క్లుప్తంగా

పోతునూరులో పారిశుద్ధ్య వారోత్సవాలు



పోతునూరులో ఫిల్టర్ బెడ్స్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

దెందులూరు: పోతునూరులో సంపూర్ణ పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రక్షిత మంచినీటి పథకంలో ఫిల్టర్ బెడ్స్‌ను శుభ్రపరచడం, దళిత వీధుల్లో చెత్త తొలగించి, డ్రైయినేజీలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. పారిశుద్ధ్య పనులను సర్పంచ్ బోదుల స్వరూప్, గ్రామ కార్యదర్శి షరీఫ్ పర్యవేక్షించారు.

వ్యాయామ కళాశాల అభివృద్ధికి కృషి



వ్యాయామ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపల్ నత్తానియేలుతో ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు: రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల గోపన్నపాలెంలో ఉండటం స్ఫూర్తిదాయకమని కళాశాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు, విద్యార్థులు కలిశారు. శుక్రవారం గోపన్నపాలెంలో వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నత్తానియేలు, అధ్యాపకులు యూపీడీ, జీపీడీ విద్యార్థులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మిల్లు బాబును కలిసి కళాశాలలో బాలికలు, బాలుర హాస్టల్‌ను, కోర్టును, గ్రౌండ్‌లు, ప్రహరీ నిర్మాణం, అంతర్గత రోడ్డు నిర్మాణం, టాయిలెట్లు, విద్యుత్ లైట్లు, జిమ్‌తో పాటు ఇతర సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ ప్రాధాన్యతాక్రమంలో కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

నేడు ఏరువాక పౌర్ణమి

దెందులూరు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం దెందులూరు నర్సింగ్ కళాశాల పక్కన వంకినేని బుచ్చమ్మ పొలంలో ఉదయం 7.30 గంటలకు విఘ్నేశ్వర పూజ, 5 నాగళ్ల పూజ నిర్వహించనున్నట్టు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. అనంతరం 5 నాగళ్లతో భూమి దున్నుతామని ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని కోరారు.

రైలు ప్రమాద మృతుడి గుర్తింపు

ఏలూరు టౌన్: ఏలూరు పవర్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి మృతి చెందిన వ్యక్తి ఏలూరు గాంధీనగర్‌కు చెందిన చలమల్ల రమేష్‌గా గుర్తించామని రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపారు. రమేష్ అతిగా మద్యం సేవిస్తూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ జీవిస్తున్నాడనీ, మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కారణంతో మనస్థాపానికి గురై గురువారం సాయంత్రం విజయవాడ వైపు వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. గతంలోనూ ఇదే తరహాలో కుటుంబ సభ్యులను పదిసార్లు ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడని, మద్యానికి బానిసగా మారిన నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశామని రైల్వే ఎస్సై చెప్పారు.

యోగాతో క్రమబద్ధమైన జీవన విధానం

పెదవేగి : యోగాతో క్రమబద్ధమైన జీవన విధానం అలవడుతుందని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ బుద్ధవాస్ అన్నారు. పెదవేగి మండలం కొప్పాక ఉన్నత పాఠశాల్లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కొప్పాక ఆయుర్వేద వైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ, స్థానిక హెచ్ఎం శైలజ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగాలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. పీడీ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆశ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పెదపాడు మండలంలో..

పెదపాడు: ప్రతి ఒక్కరూ యోగాసనాలు ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఘనంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పీ ఎల్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



భీమడోలు ఉన్నత పాఠశాలలో ప్రాణాయామంలో గురువు రవికిరణ్, అధికారులు, నాయకులు



అన్నేవారిగూడెంలో మానవహారంగా నిలబడి యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు



భీమడోలు కోర్టులో ప్రాంగణం వద్ద యోగాసనాలు వేసిన జడ్జి రిషిత్, గురువు భావన రుషి



భీమడోలులో యోగాసనాలు వేసిన విద్యార్థులు

భీమడోలు: ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు యోగా ప్రయోజనాలపై గురువులు అవగాహన కల్పించారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, బీజేపీ మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువు రవికిరణ్, భీమడోలు సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఆరా ఫౌండేషన్ అధినేత భావన రుషితో కలిసి విద్యార్థులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు యోగాసనాలు వేశారు. ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, ధ్యానం చేశారు. జడ్జి టీఏఎస్ఎస్ఆర్ఏ రిషిక్ ఆధ్వర్యంలో సిబ్బంది, న్యాయవాదులు యోగాసనాలు వేశారు. రోజూ యోగా, ధ్యాన సాధన వల్ల శారీరక, మానసిక ప్రశాంతతతోపాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి తమ నిత్యం పనుల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా జీవితాన్ని గడుపుతారని గురువులు వివరించారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో యోగా మాస్టర్ రవికిరణ్‌ను ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం ఆహ్మద్ ఘనంగా సత్కరించారు. భీమడోలులోని బాలికల కళాశాలలో నిర్వహించిన యోగా వేడుకల్లో భాగంగా సీఐ బీబీ రవికుమార్ యోగాసనాలను వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అన్నేవారిగూడెంలో యూపీ పాఠశాలలో హెచ్ఎం మస్తాన్ ఆధ్వర్యంలో చిన్నారులు యోగాసనాలు వేశారు. గ్రామంలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన చిన్నారులు కుంచె ఫణి నాగసాయి, అల్లే కిరణ్, పిండి నాగవంశీకి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమాల్లో సివిల్ కోర్టు జడ్జి రిషిత్, కోర్టు సూపరింటెంటెంట్ పి.రఘు, ఎస్సై వై.సుధాకర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీ రాణి, జిల్లా నాయకులు వెజ్జు ధర్మారావు, మత్తి శ్రీనివాసశాస్త్రి, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాలి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్, కళాశాల ఇంచార్జి బాలు, వివిధ శాఖల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం మన వెంటే

ఉంగుటూరు: యోగా చేస్తే ఆరోగ్యం మన వెంటే ఉంటుందని పలువురు వ్యక్తలు అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద నిర్వహించారు. కైకరం హైస్కూల్లో, నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద, ఉప్పాకపాడు ఫ్లస్ ఫౌండేషన్ స్కూలు వద్ద యోగా దినోత్సవం నిర్వహించారు. ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద నిర్వహించిన వేడుకల్లో సర్పంచి బండారు సింధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా అనుసరించాలని అప్పుడే ఆరోగ్యం మన వెంట ఉంటుందన్నారు. విద్యార్థులు, గ్రామంలో పెద్ద వాళ్లు యోగా చేయాలన్నారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కస్తూరి శిరీష మాట్లాడుతూ అతి ప్రాచీనమైన యోగా విద్యకు ప్రధాన మంత్రి మోదీ గుర్తింపు తీసుకువచ్చారన్నారు. మన దేశంలో పుట్టిన యోగాను ప్రపంచంలో అన్ని దేశాల పౌరులు అనుసరిస్తున్నారన్నారు. సోషల్‌వర్కర్ ఉండ్రాజవరపు దుర్గారావు మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మంద జయలక్ష్మి, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పాతూరి వంశీ, తల్లాప్రగడ భీమేశ్వరరావు, కొత్త నాగేశ్వరరావు పాల్గొన్నారు. పాఠశాల-1లో హెచ్ఎం పెద్దిరాజు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కైకరం హైస్కూల్లో హెచ్ఎం ప్రసాదరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యానికి యోగాను అవలంబించాలన్నారు. నారాయనపురం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. సర్పంచి దిడ్ల అలకానంద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి

దెందులూరు: సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా ప్రతి వ్యక్తి జీవితంలో భాగం కావాలని దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం దెందులూరు ప్రభుత్వ బాలసదనంలో సూపరింటెండెంట్ శాంతరత్నం ఆధ్వర్యంలో విద్యార్థినులు యోగాసనాలు వేశారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. పోతునూరు ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణారావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

గణపవరం: ప్రతి రోజూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే రోగాలకు, ఆస్పత్రులకు దూరంగా ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చునని ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించి, యోగాసనాలు వేయించారు. గణపవరం బాలురు, బాలికల హైస్కూళ్లు, పిప్పర, కేశవరం, కాశిపాడు, అర్ధవరం, డీకే వల్లి ఉన్నత పాఠశాలలు, యూపీ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు.



చానమిల్లి హైస్కూల్లో యోగాసనాలు వేసిన విద్యార్థులు



ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద యోగా సాధన



కొవ్వలి ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేసిన విద్యార్థులు



దెందులూరు ప్రభుత్వ బాలసదనంలో యోగా సాధన

సర్వే సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సచివాలయ సర్వేయర్లకు భూసర్వేపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమణారావు

భీమడోలు: సర్వే సమస్యల పరిష్కారంపై సచివాలయ సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్వే విభాగంగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ టీబీఎస్‌వీ రమణారావు అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో శుక్రవారం భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల సచివాలయ సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహించారు. సర్వేకు సంబంధించిన సరిహద్దు వివాదాలు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై పరిష్కరించాల్సిన విధి విధానాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల సర్వేయర్ ఎస్.ధర్మారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమణారావు మాట్లాడుతూ గ్రామాల్లో భూ సర్వే చేసే తరుణంలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా సర్వే చేయాల్సిన బాధ్యత సర్వేయర్లపై ఉందన్నారు. సమస్యలు ఎదురైతే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వాటిన్నింటినీ పరిష్కరించాలని సూచించారు. నూతన ప్రభుత్వం తీసుకునే విధి విధానాల మేరకు ప్రతి ఒక్కరూ పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు పి.శ్రీనివాస్, ఎస్.విజయరాజు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించడమే లక్ష్యం



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో 2 ఏ.భాస్కర్‌కుమార్, సర్పంచ్ షేక్ రహీమాబేగం

భీమడోలు: నాణ్యమైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. పోలసానిపల్లి- 1 ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని బాలబాలికలకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సమావేశానికి హెచ్ఎం కె.తులసి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సర్పంచ్ షేక్ రహీమాబేగం, ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో డిజిటల్ విద్యాబోధన అందించడం, పూర్తిస్థాయిలో వసతులు కల్పన, రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఆట పాటలతో కూడిన చదువులను అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం 36 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు భీమడోలు రామకృష్ణ, గ్రామ పెద్దలు షేక్ హసేనా, వి. గోవిందరావు, యర్రంశెట్టి సతీష్, టీచర్ బీడీ కాటాక్షి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతల సహకారం



కాశిపాడులో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో శేషు

గణపవరం: పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం అందడం అభినందనీయమని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడులో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత అర్హతలు కలిగిన సీనియర్ ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవాసమితి సభ్యుడు వి.సూరపరాజు, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులు, టీఎస్‌పీ రంగనాయకులు, సచివాలయ సిబ్బంది, సీఆర్పీ కోటయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు



సాయిబాబు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి తగిన గుర్తింపు లభిస్తుందని ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జీవీ కిరణ్, శివకుమార్ అన్నారు. ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పరిధిలో 39 ఏళ్లపాటు వివిధ హోదాల్లో సేవలందించడంతో పాటు ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కంపెనీ ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన చొప్పల సాయిబాబు పదవీ విరమణ సన్మాన సభ స్థానిక గిరిజన భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కిరణ్, శివ కుమార్, ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ సాయిబాబు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్, జీఏవీ పాల్, ఎస్. వెంకట్రావు, సీహెచ్ జాన్ మోషే, విద్యుత్ జేఏసీ నాయకులు తురగా రామకృష్ణ, భూక్యా నాగేశ్వర రావు నాయక్, సుందరరావు, రాజ్‌కుమార్, వై. శ్రీనివాసరావు, ఇజ్రాయేలు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకులు.. వినియోగదారులకు సేవలు



దెందులూరులోని పెట్రోలు బంకు

దెందులూరు: ఇప్పటికే పెట్రోలు, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతూ ఉంటుంది. ప్రతి లీటరుపై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుముతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యాల వివరాలు చాలామందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనలపై ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పెట్రోలు బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు కల్పించకుంటే ఫిర్యాదు చేయవచ్చు.

రక్షిత తాగునీరు

నియోజకవర్గంలో వివిధ కంపెనీలకు చెందిన 24 పెట్రోలు బంకులున్నాయి. బంకుల వద్ద స్వచ్ఛమైన రక్షిత తాగునీటి వసతి కల్పించాలి. దీనికోసం బంక్ డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ కలిగి ఉండాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

ఆపదవేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోలు బంకును సందర్శించడం ద్వారా మీరు ఏ నంబరుకైనా కాల్ చేయవచ్చు.

ఉచితంగా గాలి

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో ఉచితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

మూత్రశాలలు, మరుగుదొడ్లు

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలు చోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను నిర్వాహకులు అనుమతించడం లేదనే విమర్శలున్నాయి. మరికొన్ని చోట్ల అసలు మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటరు పెట్రోలు లేదా డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంకులకు నాలుగు నుంచి 8 పైసల వరకు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నాం.

ఫిర్యాదుల పెట్టె, ప్రథమ చికిత్స కిట్

ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె, రిజిష్టరును అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతో పాటు అన్ని మందులపై గడువుతేదీ రాసి ఉంచాలి. పాత మందులు ఉంచకూడదు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోలు, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోలు, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు అందుబాటులో ఉంచుతారు.

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

పెదపాడు: ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని స్థానిక టీడీపీ నాయకుడు బొప్పిడి కాశీబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ డీవీ రమణ, ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు నాయకులు గుత్తా అనీల్, ఆగొల్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉంగుటూరు-1 పాఠశాలలో సర్పంచి బండారు సింధు, ఉపసర్పంచి పాతూరి జగదీష్ పుస్తకాలు



ఎ.గోకవరంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచి మిద్దే సత్యవతి

ఉంగుటూరు: ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పుస్తకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని పలువురు సర్పంచులు అన్నారు. ఎ.గోకవరం ప్రాథమిక పాఠశాలలో సర్పంచి మిద్దే సత్యవతి పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దేవదాసు విజయనిర్మల పాల్గొన్నారు. ఉంగుటూరు- 1, 2, 3 పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, ఉప సర్పంచి పాతూరి జగదీష్ పాల్గొన్నారు. ఎంఈవో శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. నారాయణపురం కొబ్బరి తోట ప్రాథమిక పాఠశాలలో సర్పంచి దిడ్ల అలకానంద పుస్తకాలు పంపిణీ చేశారు.

వ్యవసాయ పనిముట్ల తనిఖీ



పెదవేగిలో వ్యవసాయ పనిముట్లను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖాధికారి ఎస్కే హబీబ్

పెదవేగి : పెదవేగి మండలంలో కస్టమర్ హైరింగ్ పథకంలో వ్యవసాయ శాఖ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు సంఘాలకు అద్దె ప్రాతిపదికన మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికారాలైన ట్రాక్టర్లు, రోటోవేటర్లు, కల్టీవేటర్లను జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్కే హబీబ్ బాషా శుక్రవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ చేశారు. మండలంలో మొత్తం 28 రైతు సంఘాల గ్రూపులకు 28 ట్రాక్టర్లు పంపిణీ చేశామని చెప్పారు. వ్యవసాయ యంత్ర పరికరాలు రైతులకు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయని అధికారులను, రైతు సంఘాల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మండలానికి మంజూరైన 28 ట్రాక్టర్లు గ్రామాల్లో ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంటాయని డీఏఓ హబీబ్ భాషా తెలిపారు. గ్రామాల్లో సన్న చిన్న కారు రైతులు, ట్రాక్టర్లను వ్యవసాయ యంత్ర ఉప పరికరాలను అద్దె ప్రాతిపదికన తీసుకుని సాగు చేసుకోవాలని సూచించారు, ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి ట్రాక్టర్లను, యంత్ర పరికరాలను అన్యాక్రాంతం చేస్తే అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని డీఏఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రియాంక, ఇతర సిబ్బంది ఉన్నారు.